పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ రాంబాబు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 24: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విద్యాశాఖ, ఇతర అధికారులతో పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మార్చిలో ప్రారంభం కానున్న పరీక్షలకు జిల్లాలో మొత్తం 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 11,912 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరపనున్నట్లు చెప్పారు. పరీక్షల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రశ్నాపత్రాల తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈఓ అశోక్, డీఎస్పీ రవి, డీఎంహెచ్ఓ కోటాచలం, డీఐఈఓ భానునాయక్, ఏసీజీఈ శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపాలి

● డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

సమీక్షలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

చిలుకూరు, ఫిబ్రవరి 24: ఈ నెల 27వ తేదీన జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం చిలుకూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కోదాడ సబ్ డివిజన్ పోలీసులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో సీఐలు రజితారెడ్డి, చరమందరాజు, రాము, రామకృష్ణారెడ్డి, చిలుకూరు ఎస్ఐ రాంబాబుగౌడ్, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం

నాగారం: ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూర్.ఎస్: సుధాకర్ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న పీఓపీ వర్కర్లు

నాగారం, ఫిబ్రవరి 24: మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాతి రమేశ్ భార్య రాణి ఇటీవల మృతిచెందగా.. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సూచనల మేరకు మాచిరెడ్డిపల్లి బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాణి కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.23,500 ఆర్థిక సాయంగా అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పీఓపీ వర్కర్ కుటుంబానికి..

ఆత్మకూర్.ఎస్: మండలంలోని ఏనుబాముల గ్రామంలో ఇటీవల మృతిచెందిన పీఓపీ వర్కర్ చింతకుంట్ల సుధాకర్ కుటుంబానికి సూర్యాపేట పీఓపీ సీలింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరస్వామి చేతులమీదుగా సోమవారం రూ.33 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎన్ పీఓపీ సీలింగ్ షాప్ నిర్వాహకుడు రఫీ, పీఓపీ సీలింగ్ మేస్త్రీలు పాషా, వీరేందర్, పూల్‌చంద్, ఆనంద్, నియాజ్, ఎడ్ల నవీన్, అలెగ్జాండర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని లింగగిరి జడ్పీహెచ్ఎస్‌లో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, రాధాదుర్గా, పతంజలి, మూర్తి, పూర్వ విద్యార్థులు కోటేశ్వరరావు, జానీపాషా, నాగరాజు, రవి, కనకారావు, గోపి, నాగయ్య పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

క్షయ వ్యాధిపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ లక్ష్మి

మఠంపల్లి, ఫిబ్రవరి 24: కేంద్ర గనుల మంత్రిత్వశాఖ ఆదేశానుసారం హైదరాబాద్‌లోని ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై మండలంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ ఎస్‌సీఎల్ వర్కర్స్ కాలనీలో పరిశ్రమ మెడికల్ ఆఫీసర్ కె.లక్ష్మి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు వారాల పైబడి దగ్గు, ఆయాసం తదితర సమస్యలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో క్షయ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కాలనీ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను
ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 14x2=28 వేలు, ఆస్థి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు.
NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | పోచంపల్లి : 9182777638

పది, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, ఫిబ్రవరి 24: మార్చిలో జరుగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 28,722 మంది హాజరు కానుండగా వారి కోసం 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు 18,666 మంది విద్యార్థులు రాయనుండగా 105 రెగ్యులర్, మూడు ప్రైవేటు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోలని, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఐఈఓ దస్రూ నాయక్, డీఈఓ భిక్షపతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు అందించి మాట్లాడారు. జిల్లా కేంద్రానికి వస్తున్న వారి సమస్యలు ఇక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో అశోక్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వసతి గృహంలో రాత్రి బస

నిడమనూరు : మండలంలోని వేంపాడు శివారులోని తిరుమలగిరి సాగర్ మహాత్మా జ్యోతిబా పూలే బాలుర వసతి గృహాన్ని సోమవారం రాత్రి జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సందర్శించారు. హౌసింగ్ పీడి రాజ్ కుమార్‌తో కలిసి గురుకులానికి వచ్చిన ఆయన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం వసతి గృహంలోనే నిద్రించారు. ఆయన వెంట తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, ప్రిన్సిపాల్ చింతమల్ల రాంబాబు, గిర్దావర్ దాడి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

● 25, 26, 27 తేదీల్లో నడుపనున్న ఆర్టీసీ

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 24 : మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో నల్లగొండ రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి శైవ క్షేత్రాలకు 70 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలకు బస్సు సర్వీసులు వెళ్తాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని మేళ్లచెరువు, శ్రీశైలం, వాడపల్లి, సత్రశాల, సోమప్పకు అన్ని డిపోల నుంచి సుమారు 70 ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. అదనపు చార్జీలతో నడిపే సర్వీసుల్లో మహిళలకు మహలక్ష్మి పథకాన్ని సైతం వర్తింపజేస్తామని పేర్కొన్నారు.

ఏబీవీపీ ఎంజీయూ కమిటీ ఎన్నిక

రామగిరి, ఫిబ్రవరి 24: ఏబీవీపీ ఎంజీయూ శాఖ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగిఘణి హనుమాన్‌చారి, కార్యదర్శిగా మోన్‌సాయి ఎన్నికయ్యారు. వీరిని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కల జాన్‌రెడ్డి అభినందించారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి : డీపీఓ

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 24: అన్ని గ్రామ పంచాయతీల్లో వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని డీపీఓ వెంకయ్య ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ సంగీత, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

మాల్, ఫిబ్రవరి 24: నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని మొదరబండ గ్రామానికి చెందిన దాసరి బాయన్న (25) కుటుంబ కలహాలతో ఆదివారం రాత్రి చింతపల్లి శివారులోని పొలంలో చెట్టుకు ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాయన్న తన భార్యతో కలిసి ఐదు నెలల క్రితం చింతపల్లికి చెందిన వూరె ఆంజనేయులు గొర్రెలు కాయడానికి వచ్చాడు. మృతుడి భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.యాదయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నీలగిరి, ఫిబ్రవరి 24 : నల్లగొండ మండలంలోని దీపకుంట సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ డి.సైదాబాబు తెలిపారు. దీపకుంట గ్రామ శివారులోని పద్మావతి ఫంక్షన్‌హాల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి చేతిపై స్వరూప చెల్లి అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వివరాలు తెలిసినవారు 8712670177, 8712531330, 8712667677 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

మిర్యాలగూడ, ఫిబ్రవరి 24: మిర్యాలగూడ పట్టణంలోని 33/11 సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ హౌసింగ్‌బోర్డు ఫీడర్, 11కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ కింద రోడ్డు వైడెనింగ్ పనులు, టవర్ పనులు నిర్వహిస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎన్.రవీందర్‌రెడ్డి తెపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు మాక్స్ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి కరాచీ బేకరీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల వరకు 33/11 కేవీ ఎఫ్‌సీఐ ఇండస్ట్రీయల్ ఏరియా కింద ఉన్న ఎంఆర్ఐ మిల్లు వద్ద అన్ని మిల్లులకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● ఎమ్మెల్యే బాలూనాయక్

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 24 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన షోటోకాన్ కరాటే పోటీల్లో దేవరకొండ విద్యార్థులు ప్రతిభ కనబర్చగా సోమవారం ఎమ్మెల్యే వారిని స్థానిక స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సిరాజ్‌ఖాన్, ముత్యాల సర్వయ్య, కిన్నెర హరికృష్ణ, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ పాల్గొన్నారు.

టన్నెల్-1 సందర్శించిన ఎమ్మెల్యే

దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1 ఇన్‌లెట్ ఘటన జరిగిన ప్రాంతాన్ని సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. టన్నెల్ అంతర్భాగంలో చిక్కిన 8 మందిని కాపాడేందుకు సహాయక దళాలు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర, ఆర్డీఓ రమణారెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

కందులను మార్కెట్‌లో విక్రయించి మద్దతు ధర పొందాలి

● జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్


కందులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

హాలియా, ఫిబ్రవరి 24 : రైతుల తాము పండించిన కందులను బయట దళారులకు విక్రయించి నష్టపోకుండ మార్కెఫెడ్‌లో అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కుఫెడ్ ద్వారా రైతుల వద్ద నుంచి కందులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కందులకు క్వింటాకు రూ.7,550 మద్దతు ధర ఇస్తుందని పేర్కొన్నారు. కందులు తీసుకువచ్చే రైతులు తప్పనిసరిగా ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ సరిత, కొత్తపల్లి సహకార సంఘ సీఈఓ సత్యం, జానకిరాములు ఉన్నారు.

చోరీ కేసులో భార్యాభర్తలకు రిమాండ్

● భర్తపై 30, భార్యపై 10 కేసులు
● వివరాలు వెల్లడించిన టూటౌన్ పోలీసులు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరబాబు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 24: మిర్యాలగూడ పట్టణం సుందర్ నగర్‌కు చెందిన వేముల కోటేశ్, కృష్ణవేణి భార్యభర్తలు. వివాహమైన తర్వాత జల్సాలకు అలవాటు పడిన భర్త దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన వస్తుండడంతో ఇదేదో బాగుందని భార్య కూడా భర్తతో కలిసి దొంగతనాలు చేయడం ప్రారంభించింది. ఇద్దరు కలిసి 40 కేసుల్లో నిందితులుగా మారారు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. టూటౌన్ ఇన్‌చార్జి సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల కోటేశ్ 2010 నుంచి 2024 వరకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడగా వారిపై కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చాడు. 2024 మార్చిలో వేముల కోటేశ్, ఆయన భార్య కృష్ణవేణిపై దొంగతనం కేసులు నమోదు కావడంతో పోలీసులు జైలుకు పంపారు. గత జూలైలో జైలు నుంచి విడుదలైన తరువాత కూడా రైలు, బస్సుల్లో తిరుగుతూ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. వీరిద్దరిపై పోలీసులు నిఘా పెట్టారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటి బయట కృష్ణవేణిని కాపలాగా ఉండగా కోటేశ్ ఇంట్లోకి వెళ్లి దొంగతనం చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరిపై మొత్తం 40 కేసులు ఉన్నాయని, వీరి వద్ద నుంచి 97.9గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక ఐటెల్ స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీరబాబు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ రాంబాబు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ఏలేశ్వరానికి ప్రత్యేక లాంచీలు

నందికొండ, ఫిబ్రవరి 24 : శివరాత్రి సందర్భంగా నాగార్జునసాగర్ సమీపంలో కృష్ణా నదిలో అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ మధ్య ఉన్న ఏలేశ్వరం (మల్లయ్య) గట్టులో భక్తులు దైవ దర్శనం చేసుకునేందుకు వీలుగా పర్యాటక శాఖ లాంచీలను నడుపనున్నది. హిల్‌కాలనీ విజయవిహార్ వెనక వైపు ఉన్న లాంచీ స్టేషన్ నుంచి ఈ నెల 26న ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక లాంచీలను నడుపనున్నట్లు లాంచీ స్టేషన్ అధికారులు తెలిపారు. పెద్దలకు రూ.250 , పిల్లలకు రూ.200 టిక్కెట్ ధరను నిర్ణయించామని, 4 నుంచి 10 సంవత్సరాల్లోపు పిల్లలకు సగం టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏలేశ్వరం గట్టుకు లాంచీలు నడుపుతున్నందున బుధవారం జాలీ ట్రిప్పులు నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాబూరావుకే మద్దతు

రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ విశారదన్ మహారాజ్

నీలగిరి, ఫిబ్రవరి 24 : వరంగల్,ఖమ్మం,నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధర్మ టీచర్స్ యూనిటీ అభ్యర్థి దామెర బాబూరావుకు తాము మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ హక్కుల రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ విశారదన్ మహారాజ్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజవకర్గం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అగ్రకులాల వారికే అవకాశం కల్పించారని, ఇప్పుడైన దళిత అభ్యర్థికి అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి బాబూరావు మాట్లాడుతూ 30 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. తనను గెలిపిస్తే మరింత సేవ చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్ ధర్మా టీచర్స్ నాయకులు లింగమల్లు, మామిడి శంకర్, నాగయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు, భిక్షమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 24: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. మండలంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. విదార్థులు చెడు స్నేహాలను వదిలేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని సన్మార్గంలో నడువాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో అవసరమున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వచ్చే నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీపడదగిన కేసులను రాజీ చేసుకొని శాంతియుత జీవనాన్ని కొనసాగించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిలుకూరు, ఫిబ్రవరి 24: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన చిలుకూరు గ్రామ పరిధిలోని కవిత జూనియర్ కళాశాల వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి హుజూర్‌నగర్ నుంచి కోదాడ వైపు వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు.అతివేగమే ప్రమాదానికి కారణంగా గుర్తించిన పోలీసులు విచారణ చేపడుతున్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలి : ఎంఈఓ

నడిగూడెం, ఫిబ్రవరి 24: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపాధ్యాయులు మెరుగుపర్చాలని ఎంఈఓ ఉపేందర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు నందిగామ రామారావు, గురుస్వామి, గోవర్ధన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

అర్వపల్లి, ఫిబ్రవరి 24: జాజిరెడ్డిగూడెం గ్రామంలోని మూల కాలనీకి నాలుగు నెలలుగా గ్రామ పంచాయతీ ద్వారా సరఫరా చేసే తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనేకసార్లు ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిధులు లేకపోవడంతో తామేమీ చేయలేమని చెబుతున్నారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గండమల్ల ఎల్లేశ్, పగిడిమర్